నేటి మ్యాచ్ | బెంగళూరు X హైదరాబాద్ రా.7.30 నుంచి | వేదిక లక్నో



# క్వార్టర్స్‌కు శ్రీకాంత్



కౌలాలంపూర్: గత కొంతకాలంగా వరుస వైఫల్యాలతో కీలక టోర్నీలలో తొలి రౌండ్‌లలోనే వెనుదిరుగుతున్న ప్రపంచ మాజీ వరల్డ్ నంబర్‌వన్ కిదాంబి శ్రీకాంత్ మలేషియా మాస్టర్స్‌లో అదరగొడుతున్నాడు. క్వాలిఫయింగ్ రౌండ్స్‌లో దుమ్మురేపిన శ్రీకాంత్.. ఈ టోర్నీ క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో శ్రీకాంత్ 23-21, 21-17తో నట్ ఎంగ్యుయెన్ (ఐర్లాండ్)ను మట్టికరిపించాడు. శ్రీకాంత్ ముందంజ వేసినా పురుషుల సింగిల్స్ బరిలో నిలిచిన మిగతా ముగ్గురు షట్లర్లు మాత్రం ప్రిక్వార్టర్స్‌లోనే వెనుదిరిగారు. హెచ్‌ఎస్ ప్రణయ్, ఆయుష్, సతీష్ కుమార్ కరుణాకరన్ నిరాశపరిచారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల 21-17, 18-21, 21-15తో లియ పలెర్మో-జులియన్ (ఫ్రాన్స్)ను చిత్తు చేసి క్వార్టర్స్‌కు అర్హత సాధించారు.

# అండర్-19 జట్టులో వైభవ్

## ఇంగ్లండ్ పర్యటనలో సారథిగా ఆయుష్



ఢిల్లీ: ఐపీఎల్‌లో ఆడిన తొలి సీజన్‌లో అంచనాలకు మించి రాణించిన యువ క్రికెటర్లు వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మాత్రెకు బంపరాఫర్ దక్కింది. త్వరలో ఇంగ్లండ్‌లో పర్యటించనున్న భారత అండర్-19 జట్టులో వీరికి చోటు లభించింది. చెన్నై సూపర్ కింగ్స్ సారథి రుతురాజ్ గైక్వాడ్ గాయపడటంతో అతడి స్థానంలో వచ్చిన ఆయుష్.. తనదైన ఆటతీరుతో ఆ జట్టు భావి ఓపెనర్‌గా ప్రశంసలందుకున్నాడు. ఇక ఐపీఎల్‌లో 14 ఏండ్లకే అరంగేట్రం చేయడంతో పాటు గుజరాత్‌తో మ్యాచ్‌లో 35 బంతుల్లోనే శతకం బాదిన వైభవ్‌నూ సెలెక్టర్లు జట్టులోకి తీసుకున్నారు. జూన్ 24 నుంచి మొదలుకాబోయే ఈ పర్యటనలో భారత జట్టు.. ఇంగ్లండ్ అండర్-19తో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌తో పాటు రెండు మల్టీ-డే మ్యాచ్‌లు ఆడనుంది.

# ఇంగ్లండ్ సెంచరీల జోరు

తొలి ఇన్నింగ్స్ 498/3, జింబాబ్వేతో టెస్టు

నాటింగ్‌హామ్: జింబాబ్వేతో ఏకైక టెస్టులో ఆతిథ్య ఇంగ్లండ్ పరుగుల వరద పారిస్తున్నది. టాస్ గెలిచిన జింబాబ్వే..ఇంగ్లండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తాము తప్పు చేశామని తెలుసుకోవడానికి జింబాబ్వేకు పెద్దగా సమయం పట్టలేదు. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌ను తలపిస్తూ ఇంగ్లండ్ టాప్-3 బ్యాటర్లు ఒలీపోప్(169 నాటౌట్), డకెట్(140), క్రాలె(124) సెంచరీలతో విరుచుకుపడ్డారు. పసలేని జింజాబ్వే బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ పరుగుల వరద పారించారు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 3 వికెట్లకు 498 పరుగులు చేసింది. జోరూట్(34) టెస్టుల్లో 13వేల మైలురాయిని అందుకోవడం విశేషం. పోప్‌తో పాటు, బ్రూక్ క్రీజులో ఉన్నారు.

# వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో శశాంక్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: జర్మనీ వేదికగా జూలైలో జరుగనున్న వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌కు హైదరాబాద్‌కు చెందిన తీర్థ శశాంక్ ఎంపికయ్యాడు. ఇటీవల జైపూర్‌లో జరిగిన ఆల్‌ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో రజత పతకం సాధించడం ద్వారా శశాంక్ బెర్తు దక్కించుకున్నాడు. మాజీ డేవిస్‌కప్ జూనియర్ ప్లేయర్ అయిన శశాంక్..అంతర్జాతీయ స్థాయిలో తొలిసారి భారత్‌కు ప్రాతినిధ్యం వహించబోతున్నాడు. జాతీయ జట్టుకు ఆడబోతున్నందుకు చాలా గర్వంగా ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నాడు. ప్రస్తుతం కోచ్ ఆనంద్ దగ్గర శిక్షణ తీసుకుంటున్న శశాంక్‌కు సానియామీర్జా, ఇమ్రాన్ మీర్జా మెంటార్లుగా వ్యవహరిస్తున్నారు.

సూపర్ సెంచరీతో విజృంభణ

# మార్ష్ మోత

## గుజరాత్‌పై లక్నో ఘన విజయం

అహ్మదాబాద్: ఐపీఎల్ ప్లేఆఫ్స్ బెర్తులు ఖరారైన వేళ..లీగ్‌లో అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకోవాలనుకున్న గుజరాత్ టైటాన్స్ ఆశలు నెరవేరలేదు. గురువారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 33 పరుగుల తేడాతో లక్నో సూపర్‌జెయింట్స్ చేతిలో ఓటమిపాలైంది. గత పోరులో తమకు ఎదురైన ఓటమికి లక్నో ప్రతీకారం తీర్చుకుంది. తొలుత టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన లక్నో.. మిచెల్ మార్ష్ (64 బంతుల్లో 117, 10 ఫోర్లు, 8 సిక్సర్లు), నికోలస్ పూరన్ (27 బంతుల్లో 56 నాటౌట్, 4 ఫోర్లు, 5 సిక్సర్లు) 20 ఓవర్లలో 235/2 స్కోరు చేసింది. సీజన్ ఆసాంతం రాణించిన టైటాన్స్ బౌలర్లు.. లక్నోతో మ్యాచ్‌లో తేలిపోయారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 202 పరుగులు చేసింది. షారుక్ ఖాన్(57), రూథర్‌ఫర్డ్ (38) రాణించారు. ఓరూర్కీ (3/27), అవేశ్‌ఖాన్ (2/51), బదోని (2/4) గుజరాత్‌ను నిలువరించారు.

### మార్ష్ శతక గర్జన

ఈ సీజన్‌లో ప్యూర్ బ్యాటర్‌గా బరిలోకి దిగుతూ సంచలన ఇన్నింగ్స్‌తో చెలరేగుతున్న మార్ష్.. గుజరాత్‌తో మ్యాచ్‌లోనూ అదే జోరును కొనసాగించాడు. సిక్సర్‌తో అతడి బాదుడు మొదలైంది. తొలి ఐదు ఓవర్లలో ఆశించిన స్థాయిలో విజృంభించలేకపోయిన మార్ష్, మార్క్‌రమ్ (36).. ఆ తర్వాత రెచ్చిపోయారు. రబాడా ఆరో ఓవర్లో మార్క్‌రమ్.. రెండు భారీ సిక్సర్లతో ఇన్నింగ్స్ గేర్ మార్చాడు. సాయికిషోర్ 10వ ఓవర్లో మార్క్‌రమ్.. లాంగాన్ వద్ద షారుక్ ఖాన్‌కు క్యాచ్ ఇవ్వడంతో 91 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. మార్క్‌రమ్ ఔట్ అయిన ఆనందం టైటాన్స్‌కు ఎంతో సేపు నిలువలేదు. మూడో స్థానంలో వచ్చిన పూరన్ అండగా మార్ష్ రెచ్చిపోయాడు. 34 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తిచేసిన అతడు.. రషీద్ ఖాన్ వేసిన 12వ ఓవర్లో 6, 4, 6, 4, 4తో 25 పరుగులు రాబట్టాడు. సిరాజ్ ఓవర్లో పూరన్ 4, 6, 4తో రెచ్చిపోవడంతో గుజరాత్ స్కోరుబోర్డు పరుగులు పెట్టింది. అర్షద్ ఓవర్లో సింగిల్‌తో 56 బంతుల్లోనే మార్ష్ శతకం నమోదుచేశాడు. ఐపీఎల్‌లో అతడికిదే తొలి శతకం కాగా ఈ సీజన్‌లో ఓవర్సీస్ ప్లేయర్‌గా అతడిదే మొదటి సెంచరీ. ఆఖర్లో ధాటిగా ఆడే క్రమంలో మార్ష్ నిష్క్రమించాడు. మార్ష్, పూరన్ ద్వయం రెండో వికెట్‌కు 121 రన్స్ జోడించారు. లక్నో తరఫున రెండో వికెట్‌కు ఇదే అత్యుత్తమం. చివర్లో రిషభ్ పంత్ (16*) తనదైన రెండు ట్రేడ్‌మార్క్ సిక్సర్లతో అభిమానులను అలరించాడు.

### గుజరాత్ బోల్తా:

రికార్డు ఛేదనలో గుజరాత్ ఓపెనర్లు దూకుడుగా ఆడేందుకు యత్నించి విఫలమయ్యారు. సాయి సుదర్శన్ (21), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (35) బౌండరీలతో రెచ్చిపోయారు. కానీ ఓరూర్కీ ఐదో ఓవర్లో సుదర్శన్‌ను ఔట్ చేసి లక్నోకు తొలి బ్రేక్‌ను ఇచ్చాడు. అవేశ్ 8వ ఓవర్లో సమద్‌కు క్యాచ్ ఇచ్చాడు. 18 బంతుల్లోనే 3 బౌండరీలు, 2 సిక్సర్లతో వేగంగా ఆడిన బట్లర్ (33)ను ఆకాశ్ మహరాజ్ పదో ఓవర్లో క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత రూథర్‌ఫర్డ్(38), షారుక్‌ఖాన్(50 నాటౌట్) ఇన్నింగ్స్ బాధ్యతను భుజానేసుకున్నారు. వీర్దిదరు లక్నో బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ముఖ్యంగా షారుక్ దూకుడుగా ఆడాడు. రూథర్‌ఫర్డ్‌ను అండగా చేసుకుంటూ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. ఇన్నింగ్ సాఫీగా సాగుతున్న క్రమంలో రూథర్‌ఫర్డ్‌ను ఓరూర్కీ ఔట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 86 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఓవైపు సాధించాల్సిన లక్ష్యం పెద్దగా ఉండటం, బంతులు తక్కువ ఉండటంతో గుజరాత్‌కు ఓటమి తప్పలేదు.

### 'బ్రదర్స్' రికార్డు

ఐపీఎల్‌లో శతకాలు చేసిన అన్నాతమ్ముల జోడీగా మార్ష్ బ్రదర్స్ రికార్డు సృష్టించారు. 2008 సీజన్‌లో మిచెల్ మార్ష్ అన్న షాన్ మార్ష్.. పంజాబ్ తరఫున ఆడుతూ సెంచరీ సాధించాడు. ఆ సీజన్‌లో షాన్.. 11 ఇన్నింగ్స్‌లో ఒక శతకం, 5 అర్ధ శతకాలతో 616 రన్స్ చేశాడు. 2025లో మిచెల్ మార్ష్.. 12 ఇన్నింగ్స్‌లలో 560 రన్స్ చేయగా అతడి ఖాతాలోనూ ఓ సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు ఉండటం విశేషం.



మార్ష్ (117)

### సంక్షిప్త స్కోర్లు

**లక్నో:** 20 ఓవర్లలో 235/2 (మార్ష్ 117, పూరన్ 56*, సాయి 1/34, అర్షద్ 1/36); **గుజరాత్:** 20 ఓవర్లలో 202/9(షారుక్‌ఖాన్ 57, రూథర్‌ఫర్డ్ 38, ఓరూర్కీ 3/27, బదోని 2/4)


# ముంబైలో కొత్త ధీ(ర్)రుడు



ముంబై ఇండియన్స్‌కు సుదీర్ఘకాలం ఫినిషర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన విండీస్ వీరుడు కీరన్ పొలార్డ్ నిష్క్రమణ తర్వాత ఆ జట్టుకు లోయరార్డర్‌లో పరిస్థితులకు తగ్గట్టుగా ఆడే బ్యాటర్ లేక తంటాలు పడింది. కానీ ఈ సీజన్‌లో ముంబైకి నమన్ ధీర్ రూపంలో ఆ బెంగ తీరింది. ఈ సీజన్‌లో నమన్.. ముంబై విజయాల్లో 'అన్‌సంగ్ హీరో' అయ్యాడు. ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి వికెట్‌ను కాపాడుకోవడంతో పాటు జట్టుకు అవసరమైన సమయంలో దంచికొడుతూ కీలక పరుగులు రాబడుతున్నాడు. బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. బౌలింగ్‌కు సహకరించిన పిచ్‌పై ముంబై బ్యాటర్లు 18వ ఓవర్ దాకా చేసిన స్కోరు 132/5 మాత్రమే. కానీ అప్పుడే క్రీజులోకి వచ్చిన నమన్.. ముకేశ్ బౌలింగ్‌లో రెండు బౌండరీలు, రెండు భారీ సిక్సర్లతో రెచ్చిపోయాడు. 8 బంతుల్లోనే అతడు చేసిన రన్స్‌తో ముంబై పోరాడ గలిగే స్కోరును సాధించింది. నమన్ ఈ సీజన్ ఆరంభంలో లక్నోతో మ్యాచ్ ఆడుతూ 24 బంతుల్లోనే 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 46 రన్స్ చేసి అందరి దృష్టినీ ఆకర్షించాడు. తర్వాత బ్యాటింగ్ ఆర్డర్‌లో కిందికొచ్చి మెరుపులు మెరిపిస్తున్నాడు.

హర్యానాలోని అంబాలాలో పుట్టి పెరిగిన నమన్.. పంజాబ్ టీ20 కప్‌లో అదరగొట్టాడు. రెండు సీజన్లలో అతడు 400+ పరుగులు చేసి ముంబై స్కౌట్స్ దృష్టిలో పడ్డాడు. ఇంకేముంది! ముంబై ఈ కుర్రాడికి వేలంలో రూ. 5.25 కోట్ల ధరతో దక్కించుకుని వరుస అవకాశాలిస్తూ ప్రోత్సహిస్తున్నది. జట్టు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయని నమన్.. ఈ సీజన్‌లో ఇప్పటిదాకా 13 మ్యాచ్‌లలో 102 బంతులాడి ఏకంగా 182 సగటుతో 186 పరుగులు చేశాడు. పొలార్డ్ మాదిరిగానే నమన్ కూడా ఆల్‌రౌండర్ అయినప్పటికీ ముంబై ఈ కుర్రాడిని బ్యాటింగ్‌లో ఫినిషర్‌గా వినియోగించుకుంటున్నది. బ్యాటర్‌గానే గాక ఫీల్డింగ్‌లోనూ చురుగ్గా కదులుతూ పరుగులను అడ్డుకోవడమే గాక కీలక క్యాచ్‌లు అందుకుంటున్నాడు. ఈ సీజన్‌లో అతడు ఇప్పటిదాకా 12 క్యాచ్‌లు పట్టాడు. తన సక్సెస్‌కు ముంబై బ్యాటింగ్ కోచ్ పొలార్డ్ కారణమని అంటున్న నమన్ ఆటతీరు చూస్తే ప్రస్తుత ముంబై సారథి హార్దిక్ పాండ్యా ఈ ఫ్రాంచైజీకి ఆరంభంలో వచ్చినప్పుడు ఆడినట్టే ఆడుతున్నాడని ఆ జట్టు అభిమానులు భావిస్తున్నారు. నమన్ ఇదే జోరు కొనసాగిస్తే రాబోయే రోజుల్లో అతడు ముంబైకి కీలక ఆటగాడిగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# ఆసియా పికిల్‌బాల్ టోర్నీకి నాగ మోక్ష



హైదరాబాద్, ఆట ప్రతినిధి: వియత్నాం వేదికగా జూలైలో జరిగే ఆసియా పికిల్‌బాల్ జూనియర్ ఓపెనర్ చాంపియన్‌షిప్‌నకు తెలంగాణ నుంచి నాగ మోక్ష ఎంపికైంది. భారత జూనియర్ జట్టు తరఫున నాగ మోక్ష ప్రాతినిధ్యం వహిస్తుందని ఆల్‌ఇండియా పికిల్‌బాల్ అసోసియేషన్(ఏఐపీఏ) గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్న మోక్షకు జాతీయ జట్టులో చోటు దక్కడం పట్ల కుటుంబ సభ్యులు, అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

# విష్ణువర్ధన్‌కు రజతం

## ఖేలో ఇండియా బీచ్‌గేమ్స్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: కేంద్ర పాలిత ప్రాంతం డామన్-డయ్యూ వేదికగా జరుగుతున్న తొలి ఖేలో ఇండియా బీచ్ గేమ్స్‌లో తెలంగాణ పతక బోణీ కొట్టింది. గురువారం జరిగిన పురుషుల 5కి.మీల ఓపెన్ క్యాటగిరీ స్విమ్మింగ్‌లో రాష్ర్టానికి చెందిన గుండు విష్ణువర్ధన్ 1:06:58సెకన్ల టైమింగ్‌తో రజత పతకంతో మెరిశాడు. ద్రుపద్ రామకృష్ణ(1:06:46సె, కర్నాటక), హేమంత్(1:07:41సె, తమిళనాడు) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. మరోవైపు పురుషుల సెపక్‌తక్రా డబుల్ ఈవెంట్‌లో ఆకుల హరినాథ్, సుమంత్, శశాంక్‌తో కూడిన తెలంగాణ టీమ్ కాంస్య పతకాన్ని ఖాతాలో వేసుకుంది.

# రైజాకు రజతం

షుల్(జర్మనీ): ఐఎస్‌ఎస్‌ఎఫ్ జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత యువ షూటర్ రైజా ఢిల్లాన్ రజత పతకంతో మెరిసింది. గురువారం జరిగిన మహిళల స్కీట్ ఈవెంట్లో రైజా 51 షాట్లతో రెండో స్థానంలో నిలువగా, 53 షాట్లతో ఫోబె బోడ్లెస్కాట్(బ్రిటన్) స్వర్ణం గెలుచుకోగా, అన్నాబెల్లా హెట్మర్ కాంస్యం ఖాతాలో వేసుకుంది. ప్రపంచకప్ స్థాయిలో రైజాకు తొలి వ్యక్తిగత పతకం కావడం విశేషం.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.